
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 7
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 14 జనవరి 2025



సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు సోమవారం భోగితో మొదలయ్యాయి. ఇప్పటికే 10 రోజులుగా జిల్లా అంతటా ముగ్గుల పోటీలు, ఎడ్ల పందేలు, పిల్లలు.. యువతకు క్రీడా పోటీల సందడి కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఇళ్ల ముందు, కూడళ్లలో భోగి మంటలను ఉత్సాహంగా వేశారు. కొత్త దుస్తులు ధరించి, దోసెలు ఆరగించి, చుట్టాలు, స్నేహితులతో సంతోషంగా గడిపారు. ఇక, సోమవారంతో ధనుర్మాసం ముగియడంతో వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణాలు వైభవంగా జరిగాయి.



రాపూరు : పెంచలకోనలో గోదాదేవి కల్యాణం



నేడు సంక్రాంతి

పెద్దల పండుగకు సిద్ధం ● ఉత్సాహంగా భోగి మంటలు ● వైభవంగా గోదా కల్యాణాలు



కందుకూరులో భోగి మంటలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశిస్తుండటంతో మంగళవారం మకర సంక్రాంతి పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట పొంగళ్లు పొంగిస్తారు. ఇష్టదైవాలకు పూజలతోపాటు పితృదేవతలను ఆరాధిస్తారు. అందుకే దీనిని పెద్దల పండుగ అని కూడా అంటారు. రవి సంక్రమణం సందర్భంగా పితృదేవతలకు తిల తర్పణాలు వదులుతారు. కొందరు సమాధుల తోటలకు వెళ్లి పెద్దలకు నూతన వస్త్రాలు, ఇష్టమైన పిండి వంటలు సమర్పించి వారి ఆశీస్సులు కోరుతారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగరంతోపాటు అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో శ్మశాన వాటికల వద్ద పెద్దల పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రేపు కనుమ

● పశువుల పండుగ ● పారువేట ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబ రాల్లో మూడో పండుగ కనుమ. దీనిని పశువుల పండుగగా జరుపుకుం టారు. అందుకే ఇది పట్టణాలకంటే పల్లెల్లో ఎక్కువగా జరుగుతుంది. అన్నం పెట్టే భూమిని, ధాన్యం పండించేందుకు కష్టపడే ఎద్దులు, దున్నలు, గేదెలు, ఆవులకు శుభ్రంగా స్నానం చేయించి, వాటి కొమ్ములను రంగులతో ముస్తాబు చేస్తారు. గోశాలను అలంకరించి గోవులకు ప్రత్యేక పూజలు చేస్తారు. కనుమ సంప్రదాయ వంటకంగా మినప వడలు చేస్తారు. కాగా, నెల్లూరు నగరంలో కనుమ సందర్భంగా పారువేట ఉత్సవం వైభవంగా జరుగుతుంది. ఆలయాల్లో కొలువుదీరిన స్వామివారు, దేవేరులు అందరూ తోటల్లో విహరించేందుకు తరలివస్తారు. స్టోన్‌హౌస్‌పేట నుంచి 3వ మైలు వరకు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా మైపాడు గేట్ సెంటర్లోని జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం కనుల పండువగా జరుగుతుంది. తిరునాళ్లను తలపించే ఈ పారువేట ఉత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారు.





ఉత్తర కాలువలో నీటి ప్రవాహం, నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

ఎత్తిపోయిన పథకం

● మరమ్మతుకు గురైన మోటార్లు ● తుప్పుపట్టిన సామగ్రి

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : ఇరవై అడుగుల లోతున ప్రవహిస్తున్న జలాలను ఎత్తిపోసి కాలువ ద్వారా పొలాలకు నీరు ఇచ్చేలా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల నిర్మాణాలు నేడు దిష్టిబొమ్మల్లా మారాయి. అనంతసాగరం మండలంలో ఉత్తర కాలువకు అనుసంధానంగా పాతాళపల్లి, కామిరెడ్డిపాడు వద్ద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పథకాలు నిరుపయోగంగా మారాయి. కొంత కాలం క్రితం మోటార్లు మరమ్మతులకు గురికావడం, పైపులు ఇతర సామగ్రి తుప్పుపట్టడం తదితర కారణాలతో వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటికింద నిర్దేశించిన 600 ఎకరాల ఆయకట్టు రైతులు చేసేదిలేక ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకొన్నారు. పైపుల నుంచి సంప్‌నకు నీరు ఎత్తిపోసి అక్కడ నుంచి కాలువ ద్వారా నీరు ఇచ్చేలా ఎత్తిపోతల నిర్మాణాలు చేపట్టగా కాలువలన్నీ కనుమరగయ్యాయి. నేరుగా ఉత్తర కాలువకు బోర్లు ఏర్పాటు చేసుకొని కొందరు రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు.



తుప్పుపడుతున్న పైపులు



గుడ్లూరు : చేవూరు అడ్డరోడ్డు వద్ద డివైడర్ పైకి ఎక్కిన కారు, పక్కనే వెంకటేశ్వర్లు మృతదేహం

నలుగురిని మింగిన వేగం

అతివేగం నలుగురిని పొట్టనపెట్టుకుంది. మద్యం మత్తులో ఒకరు.. అవిశ్రాంత డ్రైవింగ్ చేస్తూ మరొకరు ఈ ప్రమాదానికి కారకులయ్యారు. వెంకటాచలం, గుడ్లూరు మండలాల్లో సోమవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు బాలురు ఉండగా, ఆరుగురికి తీవ్రగాయాలు అయ్యాయి.

- వివరాలు 10లో..

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,041 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 70.543 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ఖాళీగా ఉన్న నవాబుపేట రోడ్డు



ఎస్2 థియేటర్స్ వీధిని ఇంత ఖాళీగా ఎప్పుడైనా చూశామా?

సంక్రాంతి కర్ఫ్యూ

● స్వగ్రామాలకు పట్టణ ప్రజలు ● బోసిపోయిన నెల్లూరు నగరం

● ఖాళీగా రోడ్లు ● 40 శాతంపైగా బస్సు సర్వీసుల రద్దు

సంక్రాంతి పండుగకు ప్రజలు పల్లెబాట పట్టడంతో నెల్లూరు నగరం బోసిపోయింది. పెద్ద పండుగ కోసం బట్టల షాపింగ్, నిత్యావసరాలు, పిండి వంటల సరుకుల కొనుగోలు, ఇతర పనులపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు మూడు రోజులుగా నెల్లూరు నగరానికి లక్షల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. అయితే భోగి పండుగ కోసం ఆదివారం రాత్రికి ప్రజలు పల్లెలకు తరలివెళ్లారు. దీంతో సోమవారం నగరం బోసిపోయింది. కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలి, ఆర్టీసీ, మద్రాసు బస్టాండు, వీఆర్సీ, గాంధీబొమ్మ సెంటర్... ఇలా ప్రధాన కూడళ్లలో సైతం పెద్దగా జనం కనిపించలేదు. ఎప్పుడూ రణగొణ ధ్వనులు, ట్రాఫిక్ రద్దీతో ఉండే నగరంలో ఆ హడావిడి తగ్గడం చూపరులకు కొత్త అనుభూతినిచ్చింది.

ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీ... పలు సర్వీసులు రద్దు

ప్రజలు నగరాలను విడిచి పల్లె బాట పట్టడంతో జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. నిత్యం రద్దీ ఉండే విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, చెన్నై రూట్లలో కూడా బస్సులు నిండకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఆర్టీసీ అధికారులు దూర ప్రాంతాలకు వెళ్లే పలు సర్వీసులను రద్దు చేశారు. గ్రామాల కు వెళ్లే బస్సుల సంఖ్యను కూడా తగ్గించారు. సోమవారం 462 సర్వీసులు నడపాల్సి ఉండగా 189 సర్వీసులు మాత్రమే నడిపి 273 సర్వీసులను రద్దు చేశారు. మొత్తం మీద 59 శాతం బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. ఎప్పుడూ ప్రయాణికులతో కిటకిట లాడే నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో సైతం ఖాళీ కుర్చీలు కనిపించాయి. రైల్వే స్టేషన్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి)



ఆర్టీసీ ప్రధాన బస్‌స్టేషన్‌లో బస్సుల్లేక బోసిపోయిన ప్లాట్‌ఫాంలు



బస్టాండ్లో ఖాళీ కుర్చీలు

వైభవంగా భోగి

● కనుల పండువగా గోదాదేవి కల్యాణాలు ● భక్తిశ్రద్ధలతో శివముక్కోటి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున వరకు వాడవాడలా ప్రజలు భోగి మంటలు వేసి భోగి పండుగను వైభవంగా నిర్వహించారు. పేద, ధనిక, చిన్నా పెద్దా భేదం లేకుండా అంతా భోగి మంటలు వేశారు. అలాగే నగరంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ, సీపీఎం, సీపీఐ పార్టీల కార్యాలయాల వద్ద కూడా భోగి మంటలు వేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ గృహాల వద్ద తెల్లవారుజామునే భోగి మంటలు వేసి, జిల్లాప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

● కనుల పండువగా గోదా కల్యాణాలు

సోమవారం సాయంత్రం తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, వేదాంత దేశికర్ ఆలయం, మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం, బాలాజీనగర్ సీతారా మమందిరం, గాంధీనగర్ కృష్ణమందిరం, మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, అయ్యప్ప గుడి గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంతోపాటు జిల్లాలోని అన్నీ వైష్ణవాలయాల్లో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాలు కనులపండువగా జరిగాయి. ప్రతి కుటుంబంలోనూ బంధు మిత్రులు, స్నేహితులతో కలిసి చిన్నారులకు భోగి పండ్లు పోసి మిఠాయిలు పంచారు.



రంగనాథస్వామి ఆలయంలో కల్యాణోత్సవానికి తరలుతున్న ఉత్సవమూర్తులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

● వైభవంగా శివముక్కోటి

జిల్లాలోని శైవక్షేత్రాల్లో భోగి, ఆరుద్ర నక్షత్రం, శివముక్కోటి, పౌర్ణమి సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో సోమవారం తెల్లవారుజామున శివకామసుందరి, నటరాజస్వామికి పాలభిషేకాలు జరిగాయి. ఉదయం ఆరుగంటల నుంచి శివముక్కోటి ద్వారదర్శనం జరిగింది. అనంతరం పేట ఉత్సవం జరిగింది. అనంతరం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. తదుపరి స్వామివారి వనంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

● 108 లీటర్ల తేనెతో అభిషేకం

నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామికి శివముక్కోటి సందర్భంగా 108 లీటర్ల తేనెతో అభిషేకం జరిగింది. ఈ కార్యక్రమాలను రంగనాథ భక్తమండలి, శ్రీరాజరాజేశ్వరి భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.



వైనతేయుడిపై వేదగిరీశుడి విహారం

వేదగిరి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారు సోమవారం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన ఆలయ అర్చకులు అనంతరం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. తదుపరి కొమ్మరపూడిలోని స్వామివారికి భోగి కల్యాణం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం స్వామి వారిని వేదగిరి క్షేత్రానికి పల్లకీపై తోడ్కొని వచ్చారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



వేణుగోపాలస్వామి ఆలయంలో కోలాటం ఆడుతున్న భక్తులు,



కల్యాణోత్సవంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి



సై.. సై.. జోడెడ్ల బండీ..!

కోవూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నువ్వా.. నేనా అన్నట్టుగా కొత్తూరులో ఆదివారం ఎడ్లపందేలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 31 జతల ఎడ్లు ఈ పందెంలో పాల్గొన్నాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా ఈ పోటీలను తిలకించేందుకు ఎడ్ల పెంపకందారులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. అల్లూరు ఎస్ఎస్ బ్రదర్స్‌కు చెందిన ఎడ్లు ప్రథమ స్థానం, నెల్లూరు రూరల్ పొట్టేపాళెం గ్రామానికి చెందిన వరసిద్ధి వినాయక జట్టు ఎడ్లు రెండో స్థానం, ఇందుకూరుపేట మండలం గంగపట్నానికి చెందిన చాముండేశ్వరి సీఫుడ్స్ సంస్థ ఎడ్లు మూడో స్థానం, పాటూ రుకు చెందిన పోలేరమ్మ తల్లి జట్టు ఎడ్లు 4, నెల్లూరు లోని రంగనాయకులపేటకు చెందిన రంగనాథ స్వామి జట్టు ఎడ్లు ఐదవ స్థానాన్ని దక్కించుకున్నాయి. విజేతలకు సీఐ సుధాకర రెడ్డి, ఎస్ఐ రంగనాథ్ గౌడ్, నిర్వాహకులు బహుమతి ప్రదానం చేశారు.



ప్రథమ బహుమతి అందజేస్తున్న సీఐ

యథేచ్ఛగా కోడి పందేలు

● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో సోమవారం కోడిపందేలు యధేచ్ఛగా సాగాయి. పండుగ తొలిరోజే నిర్వాహకులు తమకు అనుకూలమైన గ్రామ శివారు ప్రాంతాల్లో జోరుగా పందేలను నిర్వహించి జేబులు నింపుకున్నారు. ప్రధానంగా వరికుంటపాడు మండలంలోని తూర్పుబోయమడగలలో సాగుతున్న పందేల్లో ఇరు వర్గీయుల నడుమ విభేదాలు తలెత్తడంతో ఏక్షణంలో ఎలాంటి సంఘటనలు జరుగుతాయోననే భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో నిర్వాహకులు పందేలను వాయిదా వేసి వెనుతిరిగి వెళ్లిపోయారు. అలాగే కాంచెరువు, తూర్పుకొండారెడ్డిపల్లి, నల్లబోతలవారిపల్లి గ్రామాల్లోను పందేలు నిర్వహించినట్లు తెలిసింది. మరో వారం రోజల పాటు ఇలాంటి పందేలు రోజుకో ప్రాంతంలో నిర్వహించేందుకు నిర్వాహకులు తమదైన శైలిలో పందెంరాయుళ్లకు ముందస్తు సమాచారం అందిస్తు ప్రణాళికలు చేస్తున్నారు. కాగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కోడిపందేల జోరు అనే కథనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ వాటిని నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నలుగురు పందెంరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం : మండలంలోని ముత్తంవారిపాలెం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం కోడిపందేలు వేస్తున్న నలుగురిని లింగసముద్రం ఎస్సై షేక్ మహబూబ్ సుభానీ, సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. వారి నుంచి ఒక కోడిపుంజు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడంతో బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, ఎన్టీఆర్‌నగర్ యాదవ్‌వీధిలో పాలవ్యాపారి మల్లయ్య నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా ఆయన వద్ద బిహార్ రాష్ట్రంలోని ముజఫర్‌పూర్‌కి చెందిన సంజయ్‌యాదవ్ పనిచేస్తూ అతడి ఇంట్లోనే ఉండేవాడు. సంజయ్‌యాదవ్ బావమరిది రాకేష్‌కుమార్ యాదవ్(21) గత డిసెంబరు 28న నెల్లూరుకు వచ్చారు. బావతో కలిసి పాల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. రాకేష్‌కుమార్ యాదవ్ తన స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. కొంతకాలం కిందట వారి మధ్య మనస్పర్ధలు రావడంతో ఆ యువతి అతడిని దూరం పెట్టింది. దీంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ విషయాన్ని తరచూ బావ సంజయ్ యాదవ్‌కు చెప్పి బాధపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆయన తాను ఉంటున్న గదిలోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని సంజయ్ యాదవ్ తన యజమానితో కలిసి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, ఎస్ఐ విజయ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షమ్మ 'భోగి' గ్రామోత్సవానికి మంగళం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి, పెద్ద పండుగ పర్వదినాల్లో జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ఏటా గ్రామోత్సవం నిర్వహిస్తారు. అయితే, ఈసారి భోగి రోజే ఆరుద్ర నక్షత్రం రావడంతో శివకామసుందరి, తాండవేశ్వరస్వామిని ఊరేగించి కామాక్షమ్మ గ్రామోత్సవానికి మంగళం పాడారు. ఒకేరోజు రెండు ఉత్సవాలు రావడంతో ఒక ఉత్సవం నిర్వహించి, తాండవేశ్వరుడైనా, మల్లికార్జునస్వామి అయినా ఒక్కరే కదా అని అర్చకులు చెప్పారని ఆలయ ఇన్‌స్పెక్టర్ చెబు తుండటం గమనార్హం. గతేడాది ఆరుద్ర నక్షత్రం రోజు శివకామసుందరికి, తాండవేశ్వర స్వామి రుద్రపాదుకలకు పూజలు చేసిన అనంతరం నిత్యకల్యాణం కూడా నిర్వహించారు. కానీ ఈసారి భోగి ఉత్సవానికి మంగళం పాడేయడం చర్చనీయాంశమైంది.

16న ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

నెల్లూరు(విద్య), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో పీఎం జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. వారంతా తగిన ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 10 గంటలకు ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

నలుగురిని మింగిన వేగం

● వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

● వెంకటాచలంలో రెండు బైక్‌ల ఢీ

● తండ్రీకొడుకుల మృతి

● గుడ్లూరులో మోపెడ్‌ను ఢీకొన్న కారు

● మరో ఇద్దరు దుర్మరణం

● ఆరుగురికి గాయాలు

గమ్యానికి త్వరగా చేరుకోవాలన్న ఆతృత.. అపై అతి వేగం... అమాయక ప్రాణాలను బలితీసుకుంటోంది. వెంకటాచలం, గుడ్లూరు మండలాల్లో సోమవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి గాయాలు అయ్యాయి.

వెంకటాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒకరి మద్యం మత్తు.. అతివేగం తండ్రీకొడుకుల ప్రాణాలను బలి తీసుకుంది. వెంకటాచలం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి శాపంగా మారి ఇంటి పెద్దదిక్కు, వారసుడిని కోల్పోయేలా చేసింది. పోలీసుల కథనం మేరకు... ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా (45), తన భార్య యాస్మిన్ అలియాస్ జవహీరా, కొడుకు అబ్దుల్ హమీద్ (12)లతో కలిసి బైక్‌పై తన అత్తగారింటికి బయలుదేరారు. లేబూరు నుంచి సైదాపురం మండలం గిద్దలూరు గ్రామానికి వెళ్తుండగా వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు కూడలి సమీపంలో ఉన్న కలుజుల వద్దకు వచ్చేసరికి పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన తాటిపర్తి చంద్రశేఖర్ ఫూటుగా మద్యం తాగి బైక్‌పై అతివేగంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురూ కింద పడిపోగా షేక్ కాలేషా, హమీద్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి, ఓ ఆటోలో వారిని సమీపంలో ఉన్న సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) తరలించారు. అయితే, నిమిషాల వ్యవధిలోనే తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు విడిచారు. కళ్ల ముందే భర్త, కొడుకు ఇద్దరూ ప్రానాలు వదలడం చూసిన యాస్మిన్ కన్నీటి పర్యంతమైంది. గాయపడిన యాస్మిన్, చంద్రశేఖర్‌లను తొలుత సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

● సీహెచ్‌సీ ఎదుట నిరసన

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కొడుకులను ఉదయం 9.50 గంటలకు సీహెచ్‌సీకి తరలించారు. ఆ సమయంలో అసుపత్రి సిబ్బంది మాత్రమే ఉండి, గంటన్నర ఆలస్యంగా వైద్యులు రాగా ఈలోపు తండ్రీకొడుకులిద్దరూ మృత్యువాతపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీహెచ్‌సీ ఎదుట బైఠాయించారు. సకాలంలో వైద్యం చేసి ఉంటే వారు బతికేవారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట కూడా వైద్యులు అందుబాటులో ఉండరని, అలంకార ప్రాయంగా ఉన్న సీహెచ్‌సీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.



సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు





షేక్ కాలేషా, అబ్దుల్ హమీద్ మృతదేహాలు

పేకాట స్థావరంపై దాడి

పొదలకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆల్తుర్తి గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.30,050, నాలుగు వాహనాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనీఫ్ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది షేక్ రఫీ, రసూల్, మోహన్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఎక్కడైనా జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడ్లూరులో మోపెడ్‌ను ఢీకొన్న కారు

కందుకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం చేవూరు అడ్డరోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రావూరు గ్రామానికి చెందిన సరస్వతి, వెంకటేశ్వర్లు (66) మోపెడ్‌పై కావలి నుంచి తన స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని చేవూరు అడ్డరోడ్డు వద్ద జాతీయరహదారిని క్రాస్‌చేసే ప్రయత్నంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొంది. ఆ తర్వాత కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. మోపెడ్‌పై ఉన్న వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో అద్వికరాజ్ అనే నాలుగేళ్ల చిన్నారి కావలి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కొత్తపల్లికి చెందిన మంతెన రాజ్‌కుమార్ తన తల్లి లక్ష్మమ్మ, భార్య, సురేఖ, కుమార్తె అద్వికరాజ్, సమీప బంధువు తేజస్వితో కలిసి నాగపట్నంలోని వేళాంగిని మాత చర్చిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



అద్వికరాజ్ మృతదేహం



కలుగోళమ్మకు ఉత్సవ కళ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జరిగే కలుగోళ్ల శాంభవి గ్రామోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ట్రంకు రోడ్డు నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు సిని మాహల్ రోడ్డులో అమ్మవారి ఆకృతులతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతి పండుగను పురస్కరించికుని వడ్డిపాలెంకు చెందిన స్నేహయూత్, ఫ్రెండ్లీయూత్‌లు సోమ, మంగళవారాలలో పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెద్దపవని బస్టాండ్ సెంటర్‌లో స్నేహ యూత్, సాయిమహల్‌సెంటర్‌లో ఫ్రెండ్లీయూత్‌ల ఆధ్వర్యంలో అమ్మవారి ఆకృతులతో విద్యుత్‌దీపాల అలంకరణ చేశారు. సాయిమహల్ సెంటర్ నుంచి కలుగోళ్లశాంభవి ఆలయం వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంగళవారం రాత్రికి కలుగోళ్ల శాంభవి ఆలయం నుంచి ప్రత్యేక అలంకరణతో గ్రామోత్సవానికి బయలుదేరి బుధవారం సాయంత్రానికి తిరిగి ఆలయానికి చేరుకుంటారు. గ్రామోత్సవానికి ఎలాంటి గొడవలకు అవకాశం లేకుండా పోలీస్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

- కావలి(ఆంధ్రజ్యోతి)





ప్రసన్నుడికి మంచు ముసుగు

బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూటక్షేత్రంపై వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పొగమంచు కప్పేసింది. సోమవారం ఉదయం 9 గంటలైనా మంచు తెర వీడలేదు. ఉత్తరరాజ ముఖ ద్వారం వద్ద ఉన్న గరుడ, హనుమానులు తప్ప ఆలయం ఆగుపించలేదు. మరోవైపు ఉదయం నుంచి కారుమబ్బులు కమ్మేయగా, సాయంత్రం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

మనుబోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పోలీసులను ఢీకొట్టి పరారైన కేసులో నిందితుడు శెట్టిపల్లి దామోదరంను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. గతేడాది ఆగస్టు 23న వెంకటాచలం టోల్ గేట్ వద్ద నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా వైజాగ్ నుంచి తిరుపతి, చెన్నైలకు గంజాయిని తరలిస్తున్న కారును ఆపగా డీఎస్పీని ఢీకొట్టి అందులో ఉన్న సత్యనారాయణ, దామోదరంలు పారిపోయారు. ఏ1గా ఉన్న సత్యనారాయణను పోలీసులు పథకం ప్రకారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేయగా, దామోదరం పరారీలో ఉన్నాడు. మనుబోలు సమీపంలో సంచరిస్తున్నాడని సమాచారం రావడంతో ఆదివారం రాత్రి పొదలకూరు సీఐ అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దామోదరం చిత్తూరు జిల్లా వడమాలపేట మండలం వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7530
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ.96.10

మసకబారిన కనకపట్నం!

వస్త్ర వ్యాపార రంగంలో రెండవ ముంబయిగా కనకపట్నం కావలి ఓ వెలుగు వెలిగింది. తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా పేరొందిన షాపింగ్ మాల్స్ ప్రారంభంకావడంతో ఇక్కడి వస్త్ర వ్యాపారం ప్రాబల్యం కోల్పోయింది. ఇప్పటివరకు ఏడాదికి రూ.600 కోట్ల టర్నోవర్ వ్యాపారం జరుగుతుండగా పెరిగిన ధరలకు అనుగుణంగా టర్నోవర్ పెరగాల్సిందిపోయి తగ్గుముఖం పడుతోంది. అయితే, రేమాండ్స్, ఆదిత్య బిర్లా ఏజెన్సీలు, కందుకూరు గ్రూప్ వస్త్ర తయారీ పరిశ్రమ, గార్మెంట్స్, కరిష్మాపేరల్స్, మా గార్మెంట్స్‌ల హోల్‌సేల్ వ్యాపారం కారణంగా ఇంకా ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారి రాకపోకలతో కావలిలో కొంతమేర హోల్‌సేల్ వ్యాపారం సాగుతోంది.



కావలిలోని ఓ సముదాయంలో వస్త్ర దుకాణాలు

కావలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కావలిలో ఒక వస్త్ర తయారీ పరిశ్రమ, 4 రెడీమేడ్ గార్మెంట్స్, 4 వస్త్ర దుకాణాల సముదాయాలు, హోల్‌సేల్, రిటైల్ కలిపి 400లకుపైగా వస్త్ర దుకాణాలతో రెండవ ముంబయిగా కావలి ప్రాచుర్యంలో ఉంది. ప్రముఖ బ్రాండ్లుగా గుర్తింపు పొందిన రేమాండ్స్, ఆదిత్యా బిర్లా తదితర కంపెనీల మన్నిక గల వస్త్రాలు సరసమైన ధరలకే కావలిలో లభించడం ఇక్కడి ప్రత్యేకత. గుజరాత్, సూరత్, ముంబయి, ఈరోడ్, తిరుపూర్, చెన్నై తదితర వస్త్ర తయారీ కేంద్రాల నుంచి ఇక్కడి వ్యాపారులు నేరుగా కొనుగోలుచేసి అక్కడి ధరలకే హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. అందుకే తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. ఈ వ్యాపారంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 10వేల మందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారు. కాగా, తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా షాపింగ్ మాల్స్ పెరిగిపోవడంతో ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారం బాగా తగ్గిపోయింది. మరోవైపు ఆన్‌లైన్ వ్యాపారం కూడా కావలిని దెబ్బతీసింది. దీనికితోడు వస్త్రాలపై కూడా జీఎస్టీ విధించడంతో ధరలు పెరిగి, కొనుగోళ్లు తగ్గాయి. 6 నెలలకు ఒకసారి జీఎస్టీ ప్రక్రియ నమోదు చేయాలంటే వ్యాపారులందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. దీంతో చిన్నా చితక వ్యాపారులకు భారంగా మారుతోంది. మారిన కాలానుగుణంగా రెడీమేడ్ వ్యాపారం పెరిగి మామూలు వస్త్రాలు కొనుగోళ్లు తగ్గాయి. ఏడాదికి రూ.600 కోట్లపైన టర్నోవర్ ఉన్న కావలిలో ఆంగ్ల సంవత్సరాది రోజున, సంక్రాంతి పండుగుల సీజన్‌లో రూ.200 కోట్లు పైన టర్నోవర్ జరగాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది రూ.100 కోట్ల టర్నోవర్ మాత్రమే జరిగిందని వస్త్ర వ్యాపార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

మాల్స్ ప్రభావంతో అంతా డైవర్ట్



తెలుగు రాష్ట్రాలలో షాపింగ్ మాల్స్ విపరీతంగా పెరిగిపోయాయి. చిన్న పట్టణాల్లోనూ మాల్స్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ ప్రభావం కావలిలో హోల్‌సేల్ వస్త్ర వ్యాపారంపై పడింది. మాల్స్ ఇస్తున్న డిస్కౌంట్లు, ఆఫర్లతో ప్రజలు డైవర్ట్ అవుతున్నారు.

- అమరా సుబ్బారావు, ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్ సెల్ సభ్యుడు

ఆన్‌లైన్ బిజినెస్‌తో ఇబ్బందులు



ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారంతో రిటైల్ వ్యాపారులంతా అటువైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మా వ్యాపారం తగ్గి నష్టపోవాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రత్యామ్నాయ వ్యాపారాలను వెతుక్కోవాల్సిందే.

- మోడరన్ నరసింహం, వస్త్ర వ్యాపారి

విదేశీ మద్యం విక్రయాలపై దాడులు

● 25 సీసాల సరుకు స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య గుట్టుచప్పుడు కాకుండా విదేశీ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు మధ్యపతివారివీధిలో మునిస్వామి నాగరాజు నివాసం ఉంటున్నాడు. ఆయన చెన్నైకి చెందిన ఎస్ ప్రభు, మాణిక్యం అనే వ్యక్తుల ద్వారా విదేశీ మద్యాన్ని నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఓ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా నెల్లూరుకి దిగుమతి చేసు కునేవాడు. ఆ మద్యాన్ని తన ఇంట్లోనే ఉంచి గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరకు విక్రయించేవాడు. కొంతకాలంగా ఈ అక్రమ దందా సాఫీగా సాగింది. ఈ విషయమై ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మకు పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు స్టేట్ టాస్క్‌ఫోర్సు అధికారి మధు పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం తెల్లవారుజామున నాగరాజు ఇంటిలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో బాలెంటైన్స్, స్మైవోడ్కా, జానీవాకర్, షీవాస్‌రీగల్, కుట్టి సార్క్, తదితర విదేశీ కంపెనీలకు చెందిన లీటర్ సీసాలు మొత్తం 25ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఎక్సైజ్ నెల్లూరు-1 కార్యాలయంలో అప్పగించారు. నాగరాజుతోపాటు చెన్నైకి చెందిన ప్రభు, మాణిక్యం, ట్రాన్స్‌పోర్టుకి చెందిన రమణారెడ్డిపై ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు కేసు నమోదు చేశారు. నాగరాజును అరెస్ట్ చేశారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

భోగి మంట చూస్తూ మిద్దె పైనుంచి పడి వృద్ధురాలి మృతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి భోగి మంటలు చూస్తూ ప్రమాదవశాత్తు జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందారు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ చెప్పుల కర్మాగారం ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, బాలాజీనగర్ షూఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి- రత్నమ్మ(78) దంపతులు. వారికి ఇద్దరు పిల్లలు. సోమవారం తెల్లవారుజామున స్థానికులు, కుటుంబసభ్యులు భోగిమంటలు వేశారు. ఆ మంటలు చూస్తూ రత్నమ్మ మూడో అంతస్తు నుంచి కాలు జారి కిందపడి మృతిచెందారు.దీంతో కుటుంబసభ్యులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విజయ్‌శ్రీనివాసు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణ పంతం... అభివృద్ధికి మంత్రం

సంక్షేమం...అభివృద్ధి రెండు కళ్లుగా మంత్రి నారాయణ నెల్లూరు సిటీ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తున్నారు. ఒకవైపు ఆంధ్రుల ఆశల రాజధాని అమరావతి నిర్మాణంలో తలమునకలౌతూ, మరోవైపు సొంత నియోజకవర్గమైన నెల్లూరు సిటీని అభివృద్ధికి శక్తికి మంచి శ్రమిస్తున్నారు. ఎన్నికల్లో తన కోసం కృషి చేసిన కార్యకర్తల కుటుంబాలకు పెద్దన్నగా మారారు. అభివృద్ధి ద్వారా ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి శ్రమిస్తున్నారు. గత వైసీపీ పాలకుల కక్ష సాధింపు చర్యల కారణంగా అర్థాంతరంగా ఆగిపోయిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడంతో పాటు వేలాదిగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు జీవం నింపే పనిలో నిమగ్నమయ్యారు. సిటీ నియోజకవర్గంలోని పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూనే తన వంతుగా కోట్లాది రూపాయల సొంత నిధులతో తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చదువుతోనే కుటుంబ జీవన విధానం మారుతుందని గట్టిగా విశ్వసించే నారాయణ నగరంలోని నిరుపేద విద్యార్థుల కోసం సరికొత్త విద్యాలయం నెలకొల్పడానికి శ్రీకారం చుట్టారు. రెండు వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిని మించిన విద్య బోధనతో పాటు ఉచిత భోజనం, ఉచిత రవాణా సదుపాయాలతో సరికొత్త విద్యాలయాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచి ఆరంభించనున్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూళనకు ఇప్పటికే స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి వందలాది మందికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

అటు భూగర్భ డ్రైనేజీ... ఇటు తాగునీటి పథకం

2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం పనులు. ఆ రోజుల్లోనే దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభించింది. మొత్తం ఐదు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి క్రేంద్రాలు నిర్మిస్తున్నారు. తాగునీటి పథకం సైతం దాదాపు పూర్తయింది. ఇటీవల ఢిల్లీ వెళ్లిన మంత్రి పొంగూరు నారాయణ. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) సీఎండీ సంజాయ్ కుల్ శ్రేష్ఠతో సమావేశమయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.11 వేల కోట్లు రుణం మంజూరు చేయించడంతో పాటు, నెల్లూరు నగరంలోని పనులకు రూ.160 కోట్ల నిధులు సాధించారు. తద్వారా పనుల్లో వేగం పెంచారు.

రూ.5లకే ఆకలి తీరుస్తూ..

వైసీపీ హయాంలో మూసివేసిన అన్న క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం రాగానే పునఃప్రారంభించారు. ఏడు ప్రాంతాల్లో దాదాపు రూ.70 లక్షలు ఖర్చు పెట్టి వాటిని ఆధునీకరించారు. పాత మున్సిపల్ కార్యాలయం, పెద్దబజారు, చేపల మార్కెట్, ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, రామలింగాపురం, పప్పులవీధి తదితర ప్రాంతాల్లో క్యాంటీన్లు ప్రారంభించారు. రూ.5లకే రుచికరమైన ఆహారం అందిస్తున్నారు.



రీచ్‌లో నూతన ఇసుక విధానాన్ని పరిశీలించే క్రమంలో

చెత్త పన్నుకు చెల్లు చీటీ

నగర, పట్టణాల్లో గత ప్రభుత్వం విధించిన చెత్త పన్ను రద్దు బిల్లును మంత్రి నారాయణ శాసనసభలో ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది. ఇది ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది. 2021లో వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. నగరంలో మొత్తం 1.33 లక్షలు అసెస్‌మెంట్లు ఉండగా... రూ.118 కోట్ల మేర వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై ఆ భారం తపిపంది. అదే సమయంలో చెత్త సమస్యకు పరిష్కారంగా వేస్ట్‌టూ ఎనర్జీ ప్లాంట్ మంజూరు చేయించారు. ఇది అందుబాటులోకి వస్తే దొంతాలి, అల్లీపురం రోడ్డు నవాబుపేట సమీపంలో డంపింగ్ యార్డులు ఉండవు.

వారంలో రెండు రోజుల నెల్లూరులోనే!

మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ... వారంలో రెండు రోజులు నెల్లూరు నగరవాసులకు అందుబాటులో ఉంటున్నారు. ఐదు రోజులపాటు విజయవాడలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఇన్‌చార్జి మంత్రిగా కాకినాడలో జరిగే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. నెల్లూరు నగరంలో ఉన్న రెండు రోజుల క్షణం తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. అధికారుల సమీక్షలతోపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితులు దగ్గరుండి పరిశీలిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం, దీపం పథకం, పింఛన్ల పెంపు కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇసుక విధానంలో లోటుపాట్లను సరిదిద్దేందుకు నేరుగా రీచ్‌లకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఇరిగేషన్ కాలువల్లో జరిగే పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించేలా చర్యలు చేపట్టారు. ఐఏజీ సమావేశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని రైతులు తీసుకొచ్చిన సమస్యను, వెనువెంటనే విద్యుత్తుశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

టిడ్కో ఇళ్లకు జీవం

వెంకటేశ్వరపురం, అల్లీపురం, కొండ్లపూడి, అక్కచెరువుపాడు తదితర ప్రాంతాల్లో నిరుపేదలకు నీడ కల్పించేందుకు గతంలో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పక్షపాత ధోరణితో నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా రంగులేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం లబ్ధిదారులకు వాటిని అందించేందుకు సిద్ధం చేస్తోంది. వెంకటేశ్వరపురంలో 4,800, అల్లీపురం 11,424, అక్కచెరువుపాడు 3696, కల్లూరుపల్లి 2496, కొండ్లపూడి 2496, ఇరుగాళమ్మ సంఘం 48 ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేస్తోంది. వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానుంది.

మార్కెట్ అభివృద్ధికి ప్రతిపాదనలు

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం నవాబుపేట వద్ద నిరుపయోగంగా ఉండగా ఫల సరుకులతో పాటు పండ్లు హోల్‌సేల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడంపై నారాయణ దృష్టి సారించారు. ప్రతిపాదనలు సైతం సిద్ధం చేయించారు. అందు కోసం రూ.50 కోట్ల నుంచి రూ. వంద కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అధికారులతో నివేదికను సిద్ధం చేయించి, ప్రభుత్వానికి పంపించారు.

స్మార్ట్ సిటీగా మార్చేందుకు...

నగరాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే రోడ్లపై, గోడలు, డివైడర్లపై రంగులు వేస్తుండగా నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తెచ్చేందుకు రూ.5 కోట్లతో 40 పార్కులు అభివృది చేస్తున్నారు. పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకూ అడుగులు వేస్తున్నారు. గుంతలు లేని నగరాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా సుమారు 1400 గుంతలను గుర్తించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ఏడు వేల అనధికారిక కొళాయిలపై చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలో నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

అభివృద్ధే అజెండాగా!

రాష్ట్రంలో అన్ని నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. వీటితో పాటు మరికొన్నింటికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం పరిధిలో రూ.1587.80 కోట్లు, కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.280.90 కోట్లతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించారు. విజయవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా నగరంలో ఒకేసారి 14 టన్నుల చెత్తను తీసుకువెళ్లే అత్యాధునిక వాహనాలను ప్రారంభించారు. కానూరులో సిద్ధార్థ ఫ్లైఓవర్ ప్రారంభించారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండాలనే లక్ష్యంతో తాళ్లాయిపాలెంలో జీఐఎస్ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను సీఎం చంద్రబాబుతో కలిసి నారాయణ ప్రారంభించారు.

పట్టణ ప్రణాళికలో సంస్కరణ

భవనాలు, లేఅవుట్ల అనుమతులు సులభతరం చేస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోగా... టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాలకు చెక్ పెట్టేలా మంత్రి నారాయణ అనేక నిర్ణయాలు తీసుకున్నారు. నుడాలో అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. డిసెంబరు 31 నుంచి సింగిల్ విండో విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు ప్రారంభించారు.



అన్నా క్యాంటీన్ ప్రారంభించి.. అల్పాహారం రుచి చూస్తూ...



ఉపాధి కల్పనలో భాగంగా తోపుడు బండ్లు అందజేస్తూ...

ఆహ్లాదం... ఆనందం... అందించేందుకు!

వారాంతంలో నెల్లూరు నగరవాసులు ఆహ్లాదంగా గడిపేందుకు సరైన వసతులు లేవు. దాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో నెల్లూరు చెరువు దగ్గర నెక్లెస్ రోడ్డు నిర్మాణాన్ని రూ. 22 కోట్లతో చేపట్టారు. చెరువు వద్ద మౌలిక వసతులతో పాటు నడక మార్గం, సైక్లింగ్ ట్రాక్, లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. సమీపంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద కూడా ఘాట్ నిర్మాణం చేపట్టారు. దాంతో నగరానికి ఒక హంగు ఏర్పడింది. సాయంత్రం వేళ ప్రజలు అక్కడ కుటుంబ సభ్యులతో సేద తీరడానికి తగిన అభివృద్ధి పనులు చేస్తున్నారు. రంగనాయకుల ఘాట్, శివాలయం దగ్గర కోనేరు, బాప్టిజం ఘాట్ అభివృద్ధికి రూ.16 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం మళ్లీ సుందరీకరణపై దృష్టి పెట్టారు. తిక్కన పార్క్, పినాకిని పార్క్, పెన్నా బ్యారేజీల తీరును పరిశీలించారు. రంగనాయకులపేట నుంచి పొట్టేపాళెం వరకు సుందరీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ బజార్లు

వీధి వ్యాపారులకు జీవనోపాధి వసతుల కల్పనకు నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ బజార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూవబుల్ కంటెయినర్లలో దుకాణాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కంటైనర్‌కు రూ.6 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో 160 దుకాణాలు ఏర్పాటు చేసి, చిరు వ్యాపారులకు అందించనున్నారు. ఒక కంటైనర్‌లో 4 దుకాణాలు నిర్మించడంతోపాటు సౌర విద్యుత్తు కనెక్షన్, ప్రాంగణంలో ఆహ్లాదకర పచ్చదనం, పార్కింగ్ సౌకర్యం, కంటైనర్లపై కూర్చుని ఆహార పదార్థాలు తినే హోటల్ లాంటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఉచిత వైఫై సౌకర్యం, సెల్ఫీపాయింట్, తాగునీరు, మరుగుదొడ్లు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అందుబాటులోకి తీసుకురానున్నారు. వ్యాపారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మెప్మా ఆధ్వర్యంలో రూ.2 లక్షల చొప్పున రుణం అందించనున్నారు. ఇప్పటికే 500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వరద ప్రభావిత ప్రాంతంలో..

భారీ వర్షాలకు బుడమేరు ఉప్పొంగడంతో విజయవాడ నగరం మునిగిపోయింది. 24 గంటల వ్యవధిలో కుండపోత వర్షాలతో ఆ ప్రాంతం అతలాకుతలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నారాయణ రేయింబవళ్లు అక్కడే ఉండి సేవలు అందించారు. నిరంతరం సహాయ, పునరావాస కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. సింగ్‌నగర్, పైపుల రోడ్డు, ప్రకాశ్‌నగర్, సుందరయ్యనగర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు ధైర్యం చెప్పారు. వరద తగ్గు ముఖం పట్టగానే ఇళ్లలో పేరుకుపోయిన బురద తొలగించేందుకు ఫైర్ ఇంజన్లను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు.

శతకం ఆవిష్కరణ : కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత గణపతిరాజు వెంకట శేషగిరిరావు రచించిన 'నా మంచిమాట' శతకం ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు

అనతసాగరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పిలుపు మేరకు టీడీపీ శాశ్వత సభ్యత్వాలకు నేతలు పోటీపడుతున్నారు. సోమవారం మండలంలోని సాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, మెట్టు కూరు సుబ్బారెడ్డి, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, శాఖమూరి వెంకటేశ్వర్లు, కమ్మ ప్రభాకర్‌నాయుడు, రాపూరు సుజాత, ఖాసీంబాషా, మహేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. నాయకులను మంత్రి ఆనం అభినందించారు.



కందుకూరు: పలుకూరులో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



జలదంకిలో ముగ్గుల పోటీ విజేతకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కావలి : రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ,సంఘం నేతలు

సుహృద్భావం, ఐక్యతకు క్రీడలు దోహదం : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సుహృద్భావం, ఐక్యత పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుకూరు గ్రామాభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని క్రీడాకారుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, వెంకట నరసింహం, యడపల్లి చంద్రయ్య, ఎంతఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే కాకర్ల బహుమతులు

జలదంకి (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ గ్రామాల్లో కొత్తశోభను తెచ్చిపెట్టింది. సుదూరప్రాంతాలలో ఉంటున్న కుటుంబసభ్యులు పండుగకు స్వగ్రామానికి చేరుకుని భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు జామునే ప్రతి ఇంటా భోగిమంటలు వేసుకున్నారు. చిన్నారులకు భోగిపొళ్ళు పోశారు. పండుగను పురస్కరించుకుని జలదంకి, బ్రాహ్మణక్రాకలలో ఆటల పోటీలు నిర్వహించారు. జలదంకి హైస్కూల్‌లో కబడ్డీ పోటీలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముగ్గుల పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే చేతులమీదుగా నిర్వాహకులు నగదు బహుమతి

● భోగి సంబరాలలో నేతల సందడి

అందించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆటలపోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

● వింజమూర (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. స్థానిక టీడీపీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఆయన భోగి మంటలు వేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండరు ఆవిష్కరించిన ఎమ్మెల్యే దగుమాటి

కావలి (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నివాసంలో సోమవారం కావలి రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు జేదిత్య ప్రింట్ చేయించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారు విశేషంగా జరుపుకునే పండుగ సంక్రాంతిని ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందాలు వెల్లివిరియాలన్నారు. నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో సుభిక్షితంగా ఉండాలని కోరుకున్నారు. ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలపటానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కార్యాలయం కిటకిటలాడింది.





ఇస్కపల్లిలో సంక్రాంతి సంబరాలు

అల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని ఇస్కపల్లిలో సంబరాలు మిన్నంటాయి. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పదవీ బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారి ఇస్కపల్లిలో సోమవారం పర్యటించారు. బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో తన కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఆయన ఇంటి వద్దకు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలుగు సంప్రదాయాలకు ప్రతీక అయిన గంగిరెద్దు, హరిదాసులతో ముంగిట్లో సంక్రాంతి శోభను సంతరించుకుంది. కోలాటాలు, మంగలవాయిద్యాలతో స్థానిక కాశీవిశ్వేశ్వరాలయానికి, అనంతరం గంగమ్మ ఆలయానికి తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు. గత నాలుగు రోజులుగా ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని యువతకు నిర్వహించిన ఆటల పోటీలు, మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నార్ డెల్టా ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజామున పార్టీ నాయకులు దామా మల్లేశ్వరావు, నార్నె రోశయ్య తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని భోగి మంటలు వేసి వేడుకలు నిర్వహించారు.











నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

రేపు పడవల పోటీ

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 13(ఆంధ్ర జ్యోతి): నగరంలోని లేక్‌వ్యూకాలనీ వద్ద ఉన్న స్వర్ణాల చెరువులో బుధవారం పడవల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బర్నాబాస్ తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల ప్రోత్సాహంతో సంక్రాంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.







గోదా,రంగనాథుల కల్యాణోత్సవం

పొదలకూరు, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని శ్రీనివాస లే అవుట్‌లో వెలసిన గోదా సమేత వేంకటేశ్వరాలయంలో అయ్యప్పనగర్‌లో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయా ల్లో సోమవారం గోదా రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేద పండితులు శ్రీనివాసాచార్యులు కళ్యాణం విశిష్టతను తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ వడ్డిపా ళెం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావ రంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,900 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రూ.25 లక్షలతో విరూపాక్ష ఆలయం అభివృద్ధి

- రాష్ట్ర మంత్రి నారాయణ

ముత్తుకూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈపూరులో వెలిసిన పార్వతీ సమేత విరూపాక్ష స్వామి ఆలయాన్ని తన సొంత నిధులు రూ.25 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. భోగి పండుగ సందర్భంగా సోమవారం విరూపాక్ష స్వామి ఆలయంలో ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, టీడీపీ నాయకులు, ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భోగి పం డుగకు విరూపాక్ష స్వామిని దర్శించుకుని ప్రత్యే క పూజలు చేస్తున్నామన్నారు. అప్పట్లో తమ తండ్రి కండక్టర్‌గా ఈ ప్రాంతంలో పని చేసేవారని, ఆ సమయం నుంచి ప్రతి భోగికి విరూపాక్ష దర్శనం ఆనవాయితీగా మారిందన్నారు. స్వామివారిని దర్శించుకుని ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్రాన్ని కాపాడాలని, ప్రజలందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామన్నారు. ఆలయం అభివృద్ధికి తనవంతుగా ఇచ్చే రూ.25 లక్షలతో పాటు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడి మ్యాచింగ్ గ్రాంట్ మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నారాయణకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నేడు మహాలక్ష్మికి విశేష పూజలు

నెల్లూరురూరల్,జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మూలాపేట రాజాగారివీధి బెస్తపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గొల్ల సుబ్బారావు, కార్య నిర్వాహకులు శేఖర్‌బాబు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి రోజున మహాలక్ష్మి అమ్మవారిని సంక్రాంతిలక్ష్మీగా ఆహ్వానిస్తూ విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని చెప్పారు. ఇందుకుగాను ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆలయాల పాలక మండలిలో స్థానం కల్పించాలి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : విశ్వ బ్రాహ్మణులకు ఆలయాల పాలక మండలిలో స్థానం కల్పించాలని నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సోమవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సేవా సం ఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులు మంత్రి ఆనంను కలిశారు. విరాట్‌నగర్‌లోని పోతులూ రి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ధ్వజస్తం భం దెబ్బతిన్నదని, దానిస్థానంలో కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుకు ప్రభుత్వ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి ఆనం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ నేతలు

కామాక్షితాయి సేవలో బెంగళూరు ఐపీఎస్ అధికారి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఐపీఎస్ అధికారి మువ్వా చంద్రశేఖర్, సేలిహా దంపతులు సోమవారం మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని సందర్శించి మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. వారిని ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు, శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు అందజేశారు. వారి వెంట బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

మానవహక్కుల కమిషన్ సభ్యురాలు...

జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ఆమెను ఆలయ సంప్రదాయాలతో ఈవో, అర్చకులు స్వాగతించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు, శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు అందజేశారు.


జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతికి ప్రసాదం అందజేస్తున్న ఈవో శ్రీనివాసులురెడ్డి



వైభవంగా ఆరుద్ర నక్షత్రం పూజలు

- శివకామసుందరి సమేత తాండవేశ్వరస్వామికి గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం ఆలయంలోని శివకామ సుందరి సమేత తాండవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హిం చారు. స్వామివారి రుద్రపాదుకలకు వేదమంత్రాలు, మంగళమేళాల నడుమ శఠారి పంచామృత అభిషేకములు, సహస్రనామార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవారు గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం భక్తులకు శఠారి ఆశీర్వచనం, పంచామృత ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.


జొన్నవాడ ఆలయంలో తాండవేశ్వరస్వామి రుద్ర పాదుకలకు అభిషేకం, పూజలు చేస్తున్న అర్చకుడు

వరదరాజస్వామి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయంలో భోగి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి 8 గంటలకు వరదరాజస్వామి, ఆండాళమ్మవారి గోదా కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు అధ్యక్షుల నియామకం?

- ప్రభుత్వానికి జాబితా

విడవలూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడవలూరు, ముదివర్తి, వరిణి, పార్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుల నియామకం దాదాపుగా ఖరారు అయ్యింది. విడవలూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పొన్నలూరు పురందర్‌రెడ్డి, వరిణి సొసైటీ అధ్యక్షుడిగా కొడిమేర్ల వెంకటేశ్వర్లు, పార్లపల్లి సొసైటీ అధ్యక్షుడిగా వేగూరు చంద్రారెడ్డి, ముదివర్తి సొసైటీ అధ్యక్షుడిగా తన్నీరు రాజయ్యలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈ జాబితాను కూటమి ప్రభుత్వానికి పంపగా, వీరి నియామకానికి సంబంధించి త్వరలో అధికారిక ఉత్తరువులు రానున్నాయి.


ఎమ్మెల్యేను కలిసిన పురంధర్‌రెడ్డి



వైభవంగా మనుబోలమ్మ గ్రామోత్సవం

మనుబోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ గ్రామోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా భోగి పండుగ ముందు రోజు రాత్రి గ్రామదేవత ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. అందులో బాగంగా మనుబోలమ్మకు, నాగార్పమ్మకు, గంగమ్మ పరమేశ్వరీల మూలవర్లకు క్షీర, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భారీ అలంకరణలో సింహ వాహనంపై ఉంచి గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలు, మేళతాళాలు, తప్పెట్ల సందడి, బాణాసంచాల నడుమ గ్రామోత్సవం సోమవారం వేకువజాము వరకు సాగింది. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భోగిమంటలు వేసి వేడుకలు చేసుకున్నారు.


గ్రామోత్సవంలో మనుబోలమ్మ

యోగాలో స్వప్నకు డాక్టరేట్

నెల్లూరు(విద్య), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరుకి చెందిన యోగా శిక్షకురాలు జేకే. స్వప్న బెంగళూరులోని ఎస్ వ్యాస విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రాచీన భారతీయ సాహిత్యం, యోగాను ఆధారంగా తీసుకుని పాఠశాలల విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు, మానవ విలువలు మెరుగుపరచడం అనే అంశంపై ఆమె పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధనా విషయాలు ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో ప్రచురితం కాగా, ఆమె జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రశంసలు పొందారు. బెంగళూరులోని సంవిత్ రీసెర్చ్ ఫౌండేషన్ అభివృద్ధి చేసిన కోర్సు మాడ్యూళ్లను 12 పాఠశాలల్లో అమలు చేయడానికి ఆమె ఎంతో కృషి చేశారు. దీంతో ఆదివారం రాత్రి బెంగళూరులో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఉపకులపతి డాక్టర్ హెచ్ఆర్ నాగేంద్ర చేతుల మీదుగా స్వప్న పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను జిల్లాలోని యోగా అభిమానులు, ఇతర ప్రముఖులు అభినందించారు.


డాక్టరేట్ సర్టిఫికెట్‌తో స్వప్న



మున్సిపల్ కార్మికురాలికి సన్మానం


మున్సిపల్ కార్మికురాలు జయమ్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఆహ్వానం అందుకున్న నెల్లూరు మున్సిపల్ సఫాయి కార్మికురాలు వనపర్తి జయమ్మను సోమవారం ఆమె నివాసంలో బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడదల రమేష్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మున్సిపల్ కార్మికురాలు వనపర్తి జయమ్మ, ఆమె భర్త రమేష్ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, రాష్ట్రపతి పురస్కారానికి ఆహ్వానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల సుబ్బారెడ్డి, పైడిమాని ఆదినారాయణ, నీలిశెట్టి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన జిల్లా కార్యాలయంలో సోమవారం శతఘ్ని న్యూస్ క్యాలెండర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ప్రతినిత్యం జనసేన కార్యక్రమాలను శతఘ్ని న్యూస్ ప్రచురిస్తూ పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నూనెమల్లికార్జున యాదవ్, పాల్గొన్నారు.

- భోగి సంబరాలు

నగరంలోని జనసేన జిల్లా కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఆదివారం అర్ధరాత్రి భోగి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, లాయర్ శ్రీరామకృష్ణ, బీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు







ఆఖరి మజిలిలోనూ అవస్థలే..!

- కనీస సౌకర్యాలు లేని పొదలకూరు ప్రధాన మరుభూమి
- ప్రాంగణమంతా తుప్పలు, చెత్తాచెదారం, ముళ్ల చెట్లు

పొద లకూరు, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి) : పుట్టిన వారు గిట్టక తప్పదన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే గిట్టిన వారికి నిర్వహించే అంత్యక్రియలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి పట్టణంలో నెలకొంది. మండలంలోని కొన్ని గ్రామాల శ్మశాన వాటికలు పార్కులను తలపిస్తుండగా, పొదలకూరు పట్టణంలో హిందూ శ్మశానవాటికలు అందుకు భిన్నంగా ఉన్నాయి. అభివృద్ధికి మాటేమోగానీ తుప్పలు, చెత్తాచెదారం, ముళ్ల చెట్లుతో అధ్వానంగా ఉన్నాయి. దీనివల్ల మృతదేహాలను మోసుకు వెళ్లే ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. మృత దేహాన్ని భూమిలో ఖననం చేయడానికి తవ్వితే నీళ్లు ఊరుతున్నాయి. దీంతో పూడ్చడానికి అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల వారు సైతం చెత్తాచెదారాలను అక్కడే పారవేస్తున్నారు. దీంతో అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయం అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులలు ఆవేదన వ్యక్తం చేసున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శ్మశానంలో తుప్పలు చెత్తాచెదారాలను తొలగించాలని కోరుతున్నారు.


పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలతో నిండిన పొదలకూరు శ్మశాన వాటిక

డ్రైవర్స్ కాలనీలో ముగ్గుల పోటీ

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైవర్స్‌కాలనీలో సృజన సాంస్కృతిక వేదిక, వర పరివార్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా గాయనిమణి వేదాంతం హర్షవర్ధిని, సంఘ సేవకురాలు పెనాక సుజాతరెడ్డి వ్యవహరించారు. ఈ పోటీల్లో తన్మయి, నిష్మ త్రివేణి, దివ్య, పావని విజేతలుగా నిలిచారు. వారికి ముఖ్య అతిథులు ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ మారం సుధాకర్, దగ్గుపాటి రాధాకృష్ణ, కౌశల్, ఎస్.మాధవీ బహుమతులు పంపిణీ చేశారు.


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ మారం సుధాకర్, తదితరులు





ఆంధ్రజ్యోతి
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 14 జనవరి 2025





సీఎం సొంతూరు నారావారిపల్లెకు సంక్రాంతి శోభ వచ్చింది. సీఎం చంద్రబాబు కుటుంబీకుల రాకతో సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. సంక్షేమ కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ ఆయన సోమవారమంతా బిజీగా గడిపారు.



వివిధ పనులకు శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు



పిల్లలతో కలిసి దేవాన్ష్ సందడి



ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ కుమారుడు అయిన నారా దేవాన్ష్ గ్రామంలోని పిల్లలతో కలిసిపోయి ఆటలాడాడు. ఉదయం 9 గంటల నుంచి వీరి ఇంటికి సమీపంలో క్రీడాపోటీలకు సిద్ధం చేసిన ప్రదేశంలో తోటి విద్యార్థులతో కలిసి తిరుగుతూ కనిపించాడు. 'మీకు ఏ కలర్ అంటే ఇష్టం? మీరు ఏ ఆట ఆడతారు' అంటూ అక్కడే ఉన్న విద్యార్థులతో మాట్లాడాడు. వారితో కలిసి ఎక్కువ సమయం ఆడుకున్నాడు. కొంత సేపు ఫుట్‌బాల్, పరుగు పందెం ఆడాడు. బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజిక్ ఛైర్, గోతాలతో రన్నింగ్ వంటి క్రీడాపోటీల్లోనూ పాల్గొన్నాడు. ఒకట్రెండు పోటీలకు సంబంధించి ప్రోత్సాహక బహుమతులూ అందుకున్నాడు. సంక్రాంతికి ప్రత్యేకంగా తయారు చేసిన ఎద్దుల బండెక్కి గ్రామంలో చక్కర్లు కొట్టాడు.

నారావారిపల్లెకు సంక్రాంతి శోభ

- అటు ఆటలు, ముగ్గుల పోటీలు
- ఇటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కుటుంబీకులు, గ్రామస్తులతో ఉల్లాసంగా గడిపిన సీఎం చంద్రబాబు

ఆసక్తిగా ఆటలు

విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలను కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు తిలకించారు. బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ ఛైర్స్, పొటాటో కలెక్ట్, గోతాల జంపింగ్ వంటి పోటీల్లో స్థానిక పిల్లలతో కలిసి నారా దేవాన్ష్ కూడా ఉత్సాహంగా పాల్గొన్నాడు. విజేతలకు తన సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు బహుమతులు అందించారు. బహుమతుల ప్రదానం సమయంలో వేదికపైనే ఉన్న మంత్రి నారా లోకేశ్.. కాసేపు మైక్ చేతపట్టి సందడి చేశారు.



నేడు సీఎం తిరుగు ప్రయాణం

తిరుపతి (నేరవిభాగం), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి జిల్లా యంత్రాంగానికి అధికారిక సమాచారం అందింది. అలాగే, సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్ కూడా విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు తెలిసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామంలో ఉండేందుకు వీరు కుటుంబీకులతో కలిసి ఆదివారం నారావారిపల్లెకు చేరుకున్న విషయం తెలిసిందే. తొలుత బుధవారం తిరుగు ప్రయాణమవుతారని షెడ్యూల్ రాగా.. ఇప్పుడు మంగళవారమే బయలుదేరనున్నారు.



సూక్ష్మసేద్య పరికరాల లారీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న చంద్రబాబు

అలరించిన ముగ్గుల పోటీలు

నారావారిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలను ఎంపిక చేశారు. అనంతరం 10.30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన సీఎం చంద్రబాబు ముగ్గులను పరిశీలించారు. అనంతరం సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణితో కలిసి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని తనుశ్రీ, గాయత్రి.. ద్వితీయ, తృతీయ బహుమతులను బి.నాగలక్ష్మి, ఎం.పూజిత అందుకున్నారు. అందరితో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని భువనేశ్వరి అన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 126 మందికీ ప్రోత్సాహంగా రూ.10,116 చొప్పున బహుమతి ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇలా మరెన్నో పండుగలు మీతోనే కలిసి జరుపుకోవాలని కోరుకుంటున్నాని నారా బ్రహ్మిణి అన్నారు.

తిరుపతి(వైద్యం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజైన సోమవారం సీఎం చంద్రబాబు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేర్ అండ్ గ్రోతో ఇప్పటికే కుప్పంలో 480 కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను చేపడుతూ పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని సీఎం చంద్రబాబు అన్నారు. తిరుపతి జిల్లాలోనూ పైలట్ ప్రాజెక్టు కింద నారావారిపల్లె పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, కేర్ అండ్ గ్రో మధ్య ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సూక్ష్మ నీటి సాగు పథకం కింద బలరాం నాయుడు, జ్యోతికి డ్రిప్ పరికరాలను అందజేశారు. ఈ ప్రాజెక్టు కింద అర్హులందరికీ సాయం అందేలా చూడాలని ఏపీఎం



ఐసీ అధికారి సతీష్‌ను ఆదేశించారు. నారావారిపల్లెలో రూ.4.27 కోట్లతో నిర్మించనున్న 33 కేవీ సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యాన ల్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మూడు సచివాలయాల పరిధిలో రూ. 3.21 కోట్లతో 26 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా శ్రీసిటీ సౌజన్యంతో రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఏఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామగ్రి తదితర పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళలు ఇంటి నుంచే కిరాణా దుకాణాలకు వస్తువులను సరఫరా చేసి ఆర్థిక స్థితిగతులు మార్చుకునేలా ఈజీమార్ట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు డీఆర్డీఏ, వెలుగు సంస్థలు ముఖ్యమంత్రి సమక్షంలో ఎంవోయూ చేసుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టరు వెంకటేశ్వర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడి జయలక్ష్మి, డీఆర్డీఏ పీడి శోభన్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, డీపీవో సుశీలదేవి, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల రేవాండ్స్ సంస్థ సీఈవో దామోదర్, ఈజీ మార్ట్ ఫౌండర్ అండ్ సీఈవో వెంకట్, టీడీపీ నేతలు నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం

● రెండో పెళ్లికి సిద్ధమన్న ఢిల్లీ యువతి ● సంపాదనను షేర్‌లో పెట్టుబడిగా పెట్టాలని సూచన
● తిరుపతిలో డాక్టరు నుంచి రూ.84 లక్షలు కొట్టేసిన వైనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పలువిధాలుగా మారాయి. రెండో పెళ్లి ప్రయత్నాల్లో పరిచయమైన ఓ యువతి.. చివరకు సైబర్ క్రైంకు పాల్పడి రూ.84 లక్షలు కొట్టేసింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. తిరుపతిలో ప్రైవేటు ప్రాక్టీస్ ప్రాక్టీసు చేస్తున్న డాక్టరు.. కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్య నుంచి విడిపోయారు. రెండో పెళ్లి కోసం ఇటీవల మ్యాట్రిమోని సైట్‌లో తన వివరాలు పెట్టారు. దీన్ని గమనించిన ఢిల్లీకి చెందిన ఒక యువతి ఆన్‌లైన్ ద్వారా పరిచయమైంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన తనకు నెలకు రూ.1.5 లక్షల జీతం వస్తోందని చెప్పింది. అందంగా ఉన్న ఫొటోలు పెట్టింది. ఇద్దరూ కలసి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నెలకు అతడికి వచ్చే ఆదాయాన్ని తెలుసుకుంది. సంపాదనంతా వృథా ఎందుకు చేస్తున్నావని చెప్పి మాయమాటలు చెప్పింది. డబ్బులు అకౌంటులో ఉంచకుండా, ఫెడెక్స్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రెండు మూడేళ్లకు దాదాపు ఐదు నుంచి ఆరు కోట్ల రూపాయలు వస్తాయని చెప్పింది. దీనికోసం ఆ యువతి రెండు నకిలీ యాప్‌లు పంపింది. తన ఖాతాలో ఉన్న దాదాపు రూ.84 లక్షలను ఆమె చెప్పినట్లుగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టారు. కొద్ది నెలలకే ఆ నకిలీ యాప్‌లో ఇతడి పెట్టుబడి రూ.9 కోట్లకు పెరిగినట్లు చూపించింది. ఈ మొత్తంలో నుంచి రూ.5 కోట్లు డ్రా చేయడానికి ఆయన ప్రయత్నించారు. మీరు దాదాపు రూ.రెండు కోట్ల పన్ను చెల్లిస్తే అకౌంటులో వున్న డబ్బులు డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన ఆ డాక్టరు.. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

90 శాతం పోలీసులు మఫ్టీలోనే..



తిరుపతి(నేరవిభాగం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం ఎక్కువ మంది పోలీసులు మఫ్టీలో ఉన్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొన్న దాదాపు 800 మంది పోలీసులు సాధారణ దుస్తుల్లోనే కనిపించారు. దీనిపై ఒక పోలీసు అధికారిని సంప్రదించగా.. కుప్పం పర్యటన నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసులు యూనిఫాంలో రాకూడదని ఆదేశాలు అందాయన్నారు. గతంలో అయితే రిజర్వు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, సీఎం ప్రత్యేక బలగాలు సైతం మఫ్టీ డ్రస్‌లో కనిపించే వారు. ఈ సారి 90 శాతం మంది పోలీసులు మఫ్టీలో కనిపించడం గమనార్హం.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు - అభిషేకం కోసం నీటిని కాస్తూ.. - పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

ఆగమోక్తంగా ఆరుద్ర అభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర అభిషేకం ఆగమోక్తంగా జరిగింది. ధనుర్మాసంలో ప్రత్యేకించి వేడినీటి(ఉష్ణోదక)తో మూలవిరాట్‌ను అభిషేకించడం ఆనవాయితీ. ధనుర్మాసం పరమశివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్రతో ఆయనకు ఎంతో ప్రీతికరమైన సోమవారం కలసి రావడంతో ఈ అభిషేకం ప్రత్యేక విశిష్టతను సంతరించుకుంది. వేకువజామున 3గంటలకు జేగంటలు మోగించి ఉత్సవం ఆరంభించారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్ల మేలుకొలుపు తరువాత 6గంటలకు నిజరూప దర్శనంతో లింగోద్భవ కాలాభిషేకం వేదమంత్రోచ్చరణల మధ్య ఆచరించారు. ఆలయంలోపల కట్టెల పొయ్యిపై వేడినీటిని సిద్ధం చేశారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన వేడినీటితో ఉష్ణోదక అభిషేకం భక్తులకు కనువిందు చేసింది. అనంతరం నటరాజ స్వామికి గంధం, పసుపు, కుంకుమ, పంచామృతం, విభూది వంటి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీకొని 30 మందికి గాయాలు




కల్యాణి డ్యామ్ వద్ద ఢీ కొన్న బస్సులు - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చంద్రగిరి, జనవరి13(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిలో కల్యాణి డ్యామ్ మలుపు వద్ద రెండు బస్సులు ఢీకొని 30మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు సోమవారం తిరుపతి నుంచి పీలేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్యామ్ మలుపు వద్ద అదుపు తప్పింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈప్రమాదంలో మదనపల్లె డిపో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆ బస్ డ్రైవర్ వెంకరమణక తీవ్ర గాయాలయ్యాయి. రెండు బస్సుల్లో సుమారు 29 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ వెంకటరమణను అతి కష్టంపై బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రెండు బస్సులను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కాగా తలకోన సందర్శనకు వచ్చి తిరిగి కారులో వెళ్తున్న వైద్యులు సాయి, హరి, మణిలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన బస్సు

● పలువురు భక్తులకు స్వల్ప గాయాలు



తిరుమల, జనవరి13 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పడంతో 13 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి డిపో బస్సు సోమవారం మధ్యాహ్నం 19 మంది భక్తులు, ఉద్యోగులతో తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. ఘాట్‌మార్గంలోని 13వ కిలోమీటరు వద్ద బస్సు అదుపు తప్పికుడి వైపు కొండను ఢీకొంది. బస్ వెనుకభాగం రోడ్డుకు అడ్డంగా వెళ్లిపోయింది. దీంతో 13 మంది గాయపడ్డారు. మరో ఆరుగురు చిన్నపాటి చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. బస్సు రోడ్డుకు అడ్డుగా నిలిచిపోవడంతో వాహనాలన్నీ నిలిచిపోయాయి. దాదాపు అలిపిరి వరకు ట్రాఫిక్ స్తంభించింది. క్షతగాత్రులకు తిరుమలలో అశ్విని, తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. టీటీడీ ఆటోక్లినిక్, ట్రాఫిక్ పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రమాద కారణాలపై డ్రైవర్ రవి, భక్తులను పోలీసులు విచారిస్తున్నారు.

నేటి సీఎం కార్యకర్యమాలిలా..

చంద్రగిరి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మను, కుల దైవం నాగాలమ్మను దర్శించుకోనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లితండ్రులు నారా ఖర్జురపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, బసవతారకం విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ విగ్రహావిష్కరణ సినీనటుడు, నందమూరి బాలకృష్ణ ఆవిష్కరించనున్నట్లు సమాచారం.

లడ్డూ కౌంటర్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

● విద్యుత్ సరఫరా నిలిపివేతతో తప్పిన ముప్పు



తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూకౌంటర్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. 47వ నంబరు కౌంటర్‌లోని కంప్యూటర్ వైర్ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో కౌంటర్ల వద్ద భక్తులు భయభ్రాంతులయ్యారు. భారీ శబ్దాలతో మంటలు వస్తూ, ఆగుతున్న దృశ్యాలను చూసి ఆందోళన చెందారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వైర్లన్నీ తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విచారించాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

సార్.. పక్షుల పండుగకు రండి



తిరుపతి(విద్య), జనవరి 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు జరిగే పక్షుల పండుగకు రావాలంటూసీఈఎం చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్, జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్ ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం రాత్రి నారావారిపల్లెలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులున్నారు.

కాలినడకన తిరుమలకు క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి



తిరుమల, జనవరి13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ యంగ్ క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి సోమవారం కాలినడకన తిరుమలకు వచ్చా రు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా ఆయన సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం ఉద యం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి ఆలయం ముందు భోగి సంబరాలు



సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం ముందు సోమవారం వేకువజాము భోగి మంటలు వేశారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు, సిబ్బంది సంప్రదాయంగా వేశారు. భక్తులు కూడా సంబరాల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. చైర్మన్ కార్యాలయంలోనూ భోగి సంబరాలు జరిగాయి. బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, సిబ్బంది భోగిమంటలు వేశారు. తిరుమల బాలాజీనగర్‌లో స్థానికులు తమ ఇళ్ల ముందు భోగి వేయడంతో బాలాజీనగర్ మొత్తం సందడిగా మారింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సంక్రాంతి
మరియు జన్మదిన
శుభాకాంక్షలు.
RISING ANDHRA
SHINING ANDHRA
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా , చితూరు అభివృద్ధికె నిరంతరం
శ్రామికుడి లాగా ముందుకు సాగుతున్న
చిత్తూరు శాసనసభ్యులు మా ఆత్మీయసోదరుడు
శ్రీ గురజాల జగన్మోహన్ గారికి
హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు.
N AVENUE BY KONDA & GJM , NUTRINE FACTORY COMPOUND , CHITTOOR
LAUNCHING SOON...
N AVENUE :
* Mall
* 3 Star Hotel
* Luxuary villas
* Commercial Space
* High Rise Appartments
మీ...
కొండా నరేంద్ర MS USA
గ్లోబల్ వెస్ ప్రెసిడెంట్ NIVIDIA సిలికాన్ వ్యాలి ,USA
ప్రముఖ పారిశ్రామిక వేత్త , ప్రకృతి వ్యవసాయ నిపుణులు
తంబళ్లపల్లి నియోజకవర్గం

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

20 కోళ్లు, 6 మోటారు సైకిళ్ల స్వాధీనం

సూళ్లూరుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం మతకాముడిలో కోడి పందేల స్థావరంపై పోలీసులు మారువేషాల్లో వెళ్లి దాడులు నిర్వహించారు. 20 కోళ్లు, 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. సోమవారం తెల్లవారుజామున మతకాముడి గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, తడ ఎస్‌ఐ కొండప్పనాయుడు తమ సిబ్బందితో కలిసి మారువేషాల్లో వెళ్లి దాడులు చేశారు. 20 కోళ్లు, 6 మోటారు సైకిళ్లు, రూ.5,800 నగదుతో పాటు ఏడుగురిని అరెస్టు చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తూపిలిపాళెం సముద్రతీరంలో
తాబేళ్ల మృత్యుఘోష



చనిపోయిన ఆలీవ్‌రెడ్లీ తాబేలు

వాకాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో అరుదైన ఆలీవ్‌రెడ్లీ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతరించిపోయే జాబితాలో ఉన్న ఆలీవ్‌రెడ్లీ తాబేళ్లు తూపిలిపాళెం సముద్రతీరం వెంబడి వందల సంఖ్యలో చనిపోతుండడం పర్యావరణ ప్రేమికులను కలవరపెడుతోంది. గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తున్న అరుదైన ఈ జీవులు జాలర్ల వలలకు చిక్కుకొని, మరపడవల పంకాలు తగిలి ఎక్కువశాతం మృత్యువాత పడుతున్నాయి. ఆలీవ్‌రెడ్లీ తాబేళ్లు డిసెంబరు, జనవరి నుంచి మే నెల వరకు గుడ్లు పెట్టేందుకు ఒడ్డుకు వస్తుంటాయి. అవి పెట్టిన గుడ్లు 40 నుంచి 50 రోజులకు పిల్లలుగా మార్పు చెందుతాయి. సముద్రం పోటు సమయంలో పిల్లలు వాటంతట అవే సముద్రంలోకి వెళ్తాయి. తూపిలిపాళెం వద్ద రెండు రోజులుగా సముద్రపోటు ఎక్కువగా ఉండటంతో చేపల కోసం మత్స్యకారులు ఒడ్డున కర్రలు నాటి వాటికి వలలను కడుతున్నారు. ఆ సమయంలో గుడ్లుపెట్టేందుకు వస్తున్న తాబేళ్లు వలలో చిక్కుకొని చనిపోతున్నాయి. మరో వైపు సముద్రవేట కొనసాగించే మత్స్యకారుల మరపడవలు పంకాలు తగిలి మృత్యువాత పడుతున్నాయి. తూపిలిపాళెం, పూడిరాయదొరువు, కృష్ణపట్నం తదితర ప్రాంతాల్లో వీటి సంరక్షణకు ఎలాంటి చర్యలూ లేవు. అరుదైన ఆలీవ్‌రెడ్లీ తాబేళ్ల సంరక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. మత్స్యకారులకు వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ కుమార్ మాట్లాడుతూ తూపిలిపాళెం సముద్రతీరంలో తాబేళ్ల మృత్యువాతకు కారణాలు తెలుసుకుని, వాటి సంరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాబేళ్లు గుడ్లుపెట్టే కాలంలో మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు.

డక్కిలిలో కోడి పందేల జోరు

● రూ.లక్షల్లో బెట్టింగులు

డక్కిలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం డక్కిలికి సమీపంలోని కంథలవారిపల్లి వద్ద జాతీయ రహదారికి ఆనుకొని నిర్వహించిన కోడి పందేల్లో పాల్గొనేందుకు ఏర్పేడు, శ్రీకాళహస్తి, రాజంపేట, రాపూరు, సైదాపురం, గూడూరు, బాలాయపల్లి ప్రాంతాల నుంచి జూదరులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతం కోనసీమ కోడి పందేలను తలపించింది. తొలుత లింగసముద్రం వద్ద జాతీయ రహదారికి ఆనుకొనే కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో సమీపంలోని కంథలవారిపల్లి ప్రాంతానికి మార్చారు. పందేల నిర్వహణపై ముందే సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం పది గంటలకే జూదరులు తరలివచ్చారు. ఒక్క రోజులోనే రూ.లక్షల్లో బెట్టింగులు కాశారు. అలాగే డైమండ్ డబ్బా, మూడు ముక్కలాట, పేకాట నిర్వహించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపించాయి.

అన్నదానం

వెంకటగిరి టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీ ఉన్న సాయినాథుడి కుటీర మందిరంలో స్వామి వివేకానం యువసైన్యం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. గోపీనాథ్, ఫణీంద్ర, శ్యాం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఫ్లెమింగో ఫెస్టివల్: విజయశ్రీ



ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్ తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఈనెల 18 నుంచి జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం జిల్లా టూరిజం అధికారి జనార్దన రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ నాయకులతో కలిసి జూనియర్ కళాశాల మైదానంలో జరిగే పక్షుల పండగ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలపట్టు, అట్టకానితిప్ప, సూళ్లూరుపేట, బీవీపాలెం, శ్రీసిటీలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందన్నారు. 18న తొలిరోజు జూనియర్ కళాశాల మైదానంలో పక్షుల పండగను ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, 20న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే పులికాట్, నేలపట్టు, బీవీపాలెం ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. అనంతరం ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రచార పోస్టర్లను అధికారులు, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకరరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, నాయకులు అలవల శ్రీనివాసులు, రాజ సులోచనమ్మ, రవి, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఏ.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి సంబరాలు



నాయుడుపేట మార్కెట్ సెంటర్ వద్ద భోగిమంటలు వేస్తున్న యువత

నాయుడుపేట/టౌన్, గూడూరు, వెంకటగిరి టౌన్, కోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల ప్రారంభ పండుగ భోగి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం తెల్లవారుజామున ప్రతి ఇంటా భోగి మంటలు వేశారు. సంప్రదాయంగా భోగి మంటల్లో కాచిన వేడి నీళ్లతో స్నానం చేశారు. ఇళ్ల ముంగిట సంక్రాంతి సంస్కృతిని ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. గూడూరు పట్టణంలోని కోనేటిమిట్ట, కుమ్మరవీధి, తూర్పువీధి, ఆస్పత్రివీధి, మాళవ్యానగర్ తదితర ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద యువత భోగిమంటలు వేశారు. ఉదయం నుంచే వర్షం కురుస్తుండంతో ప్రజలు భోగి మంటలు వేసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. వెంకటగిరి పట్టణంలో ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. మంచి నూనెతో తలంటుకుని భోగి మంటల్లో కాగిన నీటితో స్నానం చేశారు. కోట మండలంని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, గూడలి, చిట్టేడు, కేశవరం, విద్యానగర్ తదితర గ్రామాల్లో భోగి మంటలు వేశారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

వాకాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులు మనపాటి సుమ, పనబాక శ్రీనాథ్‌కు అనురూప్‌రెడ్డి, సాయి కౌసిక్‌రెడ్డి సౌజన్యంతో రూ.6వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతారామ ధార్మికసేవా సంస్థ సభ్యులు గురుప్రసాద్, వంశీ, హరీష్‌రెడ్డి, దివి ఆనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోండి

గూడూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు లేదంటూనే కూటమి ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాన్ని మోపుతోందన్నారు. కార్యక్రమంలో జోగి శివ కుమార్, బీవీ రమణయ్య, ప్రసాద్, సురేష్, చంద్రయ్య, మదన్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఐదుగురికి స్వల్పగాయాలు

కోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని తిన్నెలపూడిరోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... సూళ్లూరుపేటకు చెందిన ఐదుగురు యువకులు వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లి విద్యానగర్ మీదుగా నాయుడుపేటకు బయలుదేరారు. క్రాస్ రోడ్డులోని తిన్నెలపూడి వద్ద కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది.

గోదాదేవి పల్లకీసేవ

సూళ్లూరుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భోగి పండగ రోజున గోదాదేవికి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ముందుగా భక్తులచే అర్చకుడు దీవి లక్ష్మీనారాయణ గోపూజ చేయించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం

గూడూరు అర్బన్, జనవరి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందకూరు సమీపంలో గల కనుమరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గోదాదేవి సమేత శ్రీకృష్ణుడికి వేదపండితుల మంత్రోచ్ఛరణలు నడుమ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

భువనేశ్వరికి విశిష్ట పూజలు

తడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బోడి లింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరి ఆలయంలో సోమవారం విశిష్ట పూజలు జరిగాయి. మహాశివుడి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని అమ్మవారికి పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమపూజ జరిగింది.